క్లుప్తంగా

కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సొసైటీ చైర్మన్ సోమిరెడ్డి

వేంసూరు: ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే రైతులకు మద్దతు ధర లభిస్తుందని లచ్చన్నగూడెం సొసైటీ చైర్మన్ గండ్ర సోమిరెడ్డి అన్నారు. ఆదివారం మర్లపాడులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రైతులు దళారులను నమ్మి మోస పోవద్దని తెలిపారు. 17 తేమ శాతం వచ్చిన ధాన్యాన్ని ఏఈఓ సర్టిఫై చేసిన తరువాత ధాన్యం కాటా వేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మందపాటి వేణుగోపాల్‌రెడ్డి, సొసైటీ డైరెక్టర్లు దుభా శ్రీనివాసరెడ్డి, దాసరి కృష్ణరెడ్డి, సీఈఓ ఎర్రగోపి రైతులు తదితరులు పాల్గొన్నారు.

లో లెవల్ బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న ఎంపీపీ శ్రీనివాసరావు

తల్లాడ: మండలంలోని అన్నారుగూడెం–గోపాలపేట రోడ్డులో వాగుపై లో లెవల్ బ్రిడ్జి నిర్మాణానికి ఆదివారం తల్లాడ ఎంపీపీ దొడ్డా శ్రీనివాసరావు శంకుస్థాపన చేశారు. సత్తుపల్లి ఎమ్మెల్యే వెంకటవీరయ్య సహకారంతో రూ.7.30 లక్షల వ్యయంతో నిర్మించనున్న బ్రిడ్జికి ఎంపీపీ భూమి పూజ చేసి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు కొమ్మినేని శ్రీనివాసరావు, మారెళ్ల దేవేందర్, నున్నా చిన్న తిరుమలయ్య, దొబ్బల బుజ్జి, సుంకర వెంకటప్పయ్య తదితరులు పాల్గొన్నారు.

బడ్డీ దుకాణాలలో వరుస చోరీలు

సత్తుపల్లిరూరల్: సత్తుపల్లి పట్టణంలోని పలు బడ్డీ దుకాణాలలో చోరీ జరిగిన సంఘటనలు శనివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. గుర్తు తెలియని దొంగలు చోరీలకు పాల్పడినట్లు తెలుస్తోంది. పట్టణంలో ఇండేన్‌ఆయిల్ పెట్రోల్‌బంక్ వద్ద ఓ పాన్‌షాపు, ద్వారకాపురి కాలనీ, కాకర్లపల్లిరోడ్, వేంసూరురోడ్, బీఎస్‌ఎన్‌ఎల్ కార్యాలయం వద్దగల బడ్డీ దుకాణాల బట్టీ తాళాలను దొంగలు పగుల గొట్టి వరుస చోరీలకు పాల్పడ్డారు. ఆయా దుకాణాలలోని నగదుతో పాటు సిగరేట్ పెట్టెలు, గుట్కా ప్యాకెట్లు, మద్యం సీసాల అపహరించారు. దీంతో బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

క్షమాపణ చెప్పాలి



సమావేశంలో మాట్లాడుతున్న కిరణ్ కుమార్

కల్లూరు రూరల్: కాంగ్రెస్ పార్టీపై ఆరోపణలు చేసిన బీజేపీ నాయకులు ఈటెల రాజేందర్ క్షమాపణ చెప్పాలని పీసీసీ రాష్ట్ర ఎస్సీసెల్ కన్వీనర్ కొండూరి కిరణ్ కుమార్, సభ్యులు మనోహరరెడ్డి, దుర్గాప్రసాద్ డిమాండ్ చేశారు. కల్లూరులో ఆదివారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. దళితుల భూములను ఖబ్జాచేసి, అవినీతి ఆరోపణలు ఎదుర్కొని బీఆర్‌ఎస్ నుంచి బర్తరఫ్ అయి బీజేపీలోకి వెళ్లిన ఈటెలపై కేసీఆర్ ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. రేవంత్ రెడ్డిపై ఆరోపణలు చేస్తే దళిత సమాజం ఊరుకోదన్నారు. ఈ సమావేశంలో నాయకులు లక్ష్మణరావు, కృష్ణారెడ్డి, గోపాల స్వామి, కృష్ణ, రంగా పాల్గొన్నారు.

మజ్జిగ వితరణ



మజ్జిగ అందజేస్తున్న దాతలు

మధిర: మధిర పట్టణంలోని హోమియో ఆస్పత్రిలో ఆదివారం శ్రీ విజయ దుర్గా టెక్నికల్ ఇన్‌స్టిట్యూట్ వారు రోగులకు మజ్జిగ వితరణగా అందించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి నిర్వహకులు సంక్రాంతి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. సమాజ సేవలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. వేసవి తాపాన్ని తీర్చేందుకు ఆస్పత్రికి వచ్చే రోగులకు మజ్జిగను అందించిన దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మేడేపల్లి శ్రీనివాసరావు, చెడే శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లో వసతులేవి?

- నరిపడా స్థలం లేక రోడ్లపైనే ధాన్యం
- రోజుల తరబడి కేంద్రాల్లో పడిగాపులు
- ఇబ్బందులు పడుతున్న రైతులు



అడసర్లపాడు ఐకేపీ కొనుగోలు కేంద్రం

ఆరుగాలం కష్టించి పండించిన పంటను అమ్ముకోవడానికి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పలు గ్రామాల్లో సొసైటీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించకపోవడం, మరోవైపు ప్రజాప్రతినిధులు ఆర్భాటంగా ప్రారంభించిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో మౌళిక వసతులు లేకపోవడం. ఇలా అనేక మంది రైతులు ఇబ్బందులకు గురౌతున్నారు. అయినప్పటికీ సంబంధిత శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడంలేదని పలువురు రైతులు ఆరోపిస్తున్నారు.

వేంసూరు: మండలంలోని ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కనీస వసతులు కల్పించకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. రామన్నపాలెం, అడసర్లపాడు, చిన్నమల్లెల, జయలక్ష్మీపురం, కుంచపర్తి, చౌడవరం, భీమవరం గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇక్కడ ధాన్యం ఆరబెట్టేందుకు రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. దీనికి తోడు తాగునీరు, కూర్చునేందుకు కుర్చీలు, నీడ ఏర్పాటు చేయాలని అధికారులు సూచిస్తున్నా.. నిర్వాహకులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. ధాన్యం పోసుకోవడానికి, కప్పడానికి గన్నీబ్యాగులు, పట్టాలు కొరత ఉంది. దీంతో రోజుల తరబడి కేంద్రాల్లోని రైతులు పడిగాపులు కాయాల్సిన పరిస్థితి నెలకొంది.

వాతావరణం మారితే హడలే..

రబీ సీజన్ సాగుచేసిన వరి కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. ఇప్పటికే పలువురు రైతులు తమ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల వద్దకు తరలించి తేమ శాతం వచ్చేందుకు ఆరబెడుతున్నారు. గత రెండో రోజుల నుంచి రాత్రి వేళల్లో వాతావరణం మార్పులతో రైతులు హడలిపోతున్నారు. భారీ వర్షం పడితే ఇక రైతుల పరిస్థితి అంతే సంగతులు. కప్పేందుకు పట్టాల కొరత వేధిస్తుంది. కొందరు తమ సొంతగా పట్టాలు ఉండగా మరికొందరు అద్దుకు తెచ్చి వాడుతున్నారు. కనీసం ఇప్పటికైన అధికారులు స్పందించి టార్పాలిన్ పట్టాలు అందుబాటులో ఉంచడంతో పాటు ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని రైతులు కోరుతున్నారు.

దారుల వెంట ధాన్యం..

ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో సరిపడ స్థలం లేక రైతులు నానా అవస్థలు పడుతున్నారు. కొందరు రైతులు తమ ఇళ్ల వద్ద ధాన్యం ఆరబెడుతుండగా, మరి కొందరు రహదారుల వెంట ధాన్యం ఆరబెడుతున్నారు. దీంతో రవాణా భారం పడుతుందని, దీనికి తోడు హమాలీలకు నగదు చెల్లించాల్సి వస్తుందని రైతులు వాపోతున్నారు.



రహదారుల వెంట ఉన్న ధాన్యం రాశులు

పట్టాలు అందుబాటులో ఉంచాలి..



ఇటీవల పడుతున్న అకాల వర్షాలతో కొనుగోలు కేంద్రాల వద్ద పట్టాలు అందుబాటులో లేకా అనేక ఇబ్బందులు పడుతున్నాం. అర్ధరాత్రి వేళలో వర్షాలు పడితే మేము ఎటు వెళ్లాలో తెలియని పరిస్థితి నెలకొంది. కావున కొనుగోలు కేంద్రాల వద్ద పట్టాలు అందుబాటులో ఉంచాలి. అలాగే హమాలీల ఖర్చు ప్రభుత్వమే చెల్లించాలి.

– అట్లూరి సత్యనారాయణరెడ్డి, అడసర్లపాడు

కనీస వసతులు కల్పించాలి



ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో కనీస వసతులు లేక ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొంది. కనీసం తాగునీరు, నీడ కూడా ఏర్పాటు చేయలేని దుస్థితి ఏర్పడింది. రైతులు కూర్చునేందుకు కూర్చీలు ఊసే ఎక్కడ కనిపించడం లేదు. ఇప్పటికైన జిల్లా స్థాయి అధికారులు స్పందించి మౌలిక వసతులపై దృష్టి సారించాలి.

– మావూరి రఘునాథరెడ్డి, అడసర్లపాడు, రైతు

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి



మాట్లాడుతున్న పోతినేని సుదర్శన్‌రావు

బోనకల్: ఉద్యమ కాలంలో సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీ మేరకు జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్‌రావు, పాలడుగు బాస్కరరావు, జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలో ఇళ్ల స్థలాల విషయమై సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జర్నలిస్టుల ఇళ్ల స్థలాలు ఇచ్చే వరకు వారికి మా మద్దతు ఉటుందన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ బాధ్యులు పల్లా కొండలరావు, కొత్తపల్లి శ్రీనివాసరెడ్డి, తేనె వెంకటేశ్వర్లు, అంజయ్య, గరిడేపల్లి వెంకటేశ్వర్లు, చేబ్రోలు నారాయణ, కోట రవికుమార్, జర్నలిస్టులు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీని వ్యతిరేకించాలి



మాట్లాడుతున్న పోతినేని సుదర్శన్

మధిర: ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్న బీజేపీని వ్యతిరేకించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్ రావు తెలిపారు. స్థానిక బోడేపూడి భవన్‌లో ఆదివారం జరిగిన ఆ పార్టీ మధిర మండల జనరల్ బాడీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాబోయే ఎన్నికల్లో బీజేపీకి అధికారం లేకుండా సాగనంపాలని కోరారు. కార్పొరేట్ సంస్థలకు ప్రభుత్వ రంగ సంస్థలను ధారాదత్తం చేస్తుందని ఆరోపించారు. ఈ సమావేశంలో సీపీఎం నాయకులు పొన్నం వెంకటేశ్వరరావు, నున్నా నాగేశ్వరరావు, శీలం నరసింహారావు, మందా సైదులు, పాలడుగు భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

జెండా పండుగను వాడవాడలా నిర్వహించాలి

సత్తుపల్లి: వాడవాడలా బీఆర్‌ఎస్ జెండా పండుగను వేడుకలా నిర్వహించాలని బీఆర్‌ఎస్ మండల, పట్టణ అధ్యక్షులు యాగంటి శ్రీనివాసరావు, ఎస్‌కే రఫీలు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను 25న నిర్వహించే జెండా పండుగ ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. అనంతరం లక్ష్మీ ప్రసన్న ఫంక్షన్‌హాల్‌లో ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య ఆధ్వర్యాన నిర్వహించే సమావేశానికి పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్, కొత్తూరు ఉమా, శీలపు రెడ్డి హరికృష్ణారెడ్డి, కూసంపూడి రామారావు, దొడ్డా శంకర్‌రావు, ఒగ్గు శ్రీనివాసరెడ్డి, చల్లగుండ్ల కృష్ణయ్య, మాధురి మధు, వనమా వాసు, ఎస్‌కే ఛాంద్‌పాషా, అనీల్, ప్రకాశరావు, పవన్, నరుకుళ్ల శ్రీను, నర్సింహారావు, నాగుల్‌మీరా, శ్రీను పాల్గొన్నారు.



పార్టీ జెండాలను అందజేస్తున్న నాయకులు

కార్పొరేషన్‌కు రూ.58.02 లక్షల ఆదాయం



వేలం నిర్వహిస్తున్న బీఎం తనూజ

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లిలోని తెలంగాణ స్టేట్ డెవలప్‌మెంట్ ఫారెస్ట్ కార్పొరేషన్ డిపోలో ఆదివారం కార్పొరేషన్ అధికారులు వెదురు గడలకు వేలం పాట నిర్వహించారు. 76 లాట్లకు వేలం నిర్వహించగా రూ.58.02 లక్షల ఆదాయం లభించినట్లు తెలిపారు. మిగిలిన 196 లాట్‌లకు వచ్చేనెల 7న వేలం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ సైదానాయక్, డీపీఎం నాగలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళన ప్రచారం



ఆత్మీయ సమ్మేళనంపై ప్రచారం చేస్తున్న దృశ్యం

కల్లూరు రూరల్: కల్లూరులో సోమవారం నిర్వహిస్తున్న ఆత్మీయ సమ్మేళనానికి బీఆర్‌ఎస్ నాయకులు విస్తృతంగా ప్రచారం చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య విశేషంగా కృషి చేస్తున్నారు. ఆదివారం మండల రైతు సమన్వయ సమితి కన్వీనర్ లక్కినేని రఘు, జెడ్పీటీసీ సభ్యులు ఎండీ ఇస్మాయిల్ చందర్‌రావు, కృష్ణ, వెంకటరత్నం, రామకృష్ణ, కిరణ్, సర్పంచ్‌లు జీప్రసాద్, ఎన్ ప్రసాద్, పుల్లారెడ్డి, మల్లేశ్వరావు, నారాయణరావు, కృష్ణ, హతిరాజు, వెంకటేశ్వరరావు, వెంకటరెడ్డి తదితరులు ఆత్మీయ సమ్మేళన ప్రచారంలో పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనంపై ఎమ్మెల్యే సండ్ర సమావేశం..

కల్లూరులో సోమవారం నిర్వహించే బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనం జనసమీకరణపై ఆదివారం రాత్రి ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య ముస్లిం ప్రముఖులతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బీరవెల్లి రఘు, జెడ్పీటీసీ సభ్యుడు కట్టా అజయ్‌కుమార్, జెడ్పీటీసీ సభ్యుడు ఎండీ ఇస్మాయిల్, ముస్లిం కమిటీ అధ్యక్షుడు సయ్యద్ అలీ, మసీదు కమిటీ అధ్యక్షుడు షేక్ ఇమాం పాల్గొన్నారు.

మూఢ విశ్వాసాలను ప్రోత్సహించొద్దు..



మాట్లాడుతున్న డాక్టర్ చీకటి భారవి

వైరా: ప్రజలను అజ్ఞానంలో ఉంచాలనే ప్రభుత్వాలు మూఢ విశ్వాసాలను ప్రోత్సహిస్తున్నాయని ప్రప్రముఖ వైద్యుడు డాక్టర్ చీకటి భారవి అన్నారు. పదో తరగతి పాఠ్య పుస్తకం నుంచి సమాజ పరిణామం శాస్త్రీయ విశ్లేషణ అనే అంశాన్ని తొలగించడంపై వైరాలో సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహించిన స్టడీ సర్కిల్‌లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. దీని వలన జాతీయోద్యమ సమభావన స్ఫూర్తి దెబ్బతింటుందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకులు బొంతు రాంబాబు, బోడపట్ల రవీందర్, డాక్టర్ పిల్లలమర్రి సుబ్బారావు, సీపీఎం మండల కార్యదర్శి నాగేశ్వరరావు, బొంతు సమత, పారుపల్లి కృష్ణారావు, మండడపు రామారావు, అమరేంద్ర, వడ్డమూడి మధు పాల్గొన్నారు.

నిరుద్యోగ నిరసన ర్యాలీని జయప్రదం చేయండి

మధిర/వైరా/చింతకాని/సత్తుపల్లిటౌన్/పెనుబల్లి: ఖమ్మంలో నిర్వహించే నిరుద్యోగ నిరసన ర్యాలీని నిరుద్యోగులు, కాంగ్రెస్ నాయకులు జయప్రదం చేయాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కోటూరి మానవతారాయ్, టీపీసీసీ సభ్యుడు మాలోత్ రాందాస్ నాయక్, పార్టీ మండల అధ్యక్షుడు అంబటి వెంకటేశ్వర్లు, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు తూమాటి నవీన్ రెడ్డి సూచించారు. ఆదివారం మధిర పట్టణంలో మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. వైరాలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ఏదునూరి సీతారాములు అధ్యక్షతన నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో, సత్తుపల్లి క్యాంపు కార్యాలయంలో, చింతకానిలో, పెనుబల్లిలోని లంకపల్లిలో కాంగ్రెస్ పార్టీ నాయకుడు నున్నా నాగేశ్వరరావు స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. తెలంగాణలో వివిధ పోటీ పరీక్షల పేపర్ లీక్, పదో తరగతి పేపర్ లీకేజీ ఘటనలను నిరసిస్తూ లీకేజీకి సంబంధించిన నిందితులను కఠినంగా శిక్షించాలన్నారు. ప్రశ్నాపత్రాల లీకేజీ వ్యవహారంలో ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుందని దుయ్యబట్టారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మోస పూరిత వాగ్దానాలతో యువతను మోసం చేస్తున్నాయన్నారు. నిరుద్యోగ సమస్యపై నిర్వహించనున్న ఈ సభకు ముఖ్యఅతిథిగా టీపీసీసీ అధ్యక్షుడు, మల్కాజ్‌గిరి ఎంపీ రేవంత్‌రెడ్డి హాజరవుతున్నారని తెలిపారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు ఐ.కృష్ణ, దేశిరెడ్డి సత్యనారాయణరెడ్డి, యోహాన్, వెంకటేశ్వరరావు, రాజబోయిన ప్రసాద్, అనీల్, ఎం.ప్రసాద్, అఫ్జల్‌బాబా, బాజీ, పొదిల హరినాద్, పాలేటి నరసింహారావు, చప్పిడి వెంకటేశ్వరరావు, పమ్మి అశోక్, బోళ్ల గంగారావు, పణితి శ్రీను, రామారావు, రాము, కొండలరావు, శ్రీను, కోటేశ్వరరావు, గోపి, రాకేష్, కిరణ్, భద్రాచలం, వీరయ్య, రవి, మండల, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు సూరంశెట్టి కిషోర్, రమణగుప్తా, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రవికుమార్, రామారావు, విజయ్, రమణ నాయక్, వెంకటరత్నం, బాజీ, రాజేంద్ర, ప్రసాద్ పాల్గొన్నారు.



సత్తుపల్లిటౌన్: మాట్లాడుతున్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి మానవతారాయ్



తల్లాడలో నేలకొరిగిన వరి పైరు

అకాల వర్షం.. అన్నదాతకు నష్టం

మరోసారి వరుణుడు ప్రతాపం చూపడంతో రైతులకు నష్టం వాటిల్లింది. ఆదివారం గాలిదుమ్ము, వర్షం జల్లులతో చేతికొచ్చిన పంటలు నేలపాలయ్యాయి. మామిడి కాయలు రాలి, మొక్కజొన్న, మిర్చి పంటలు నాశనమయ్యాయి. దీంతో మామిడి, కౌలు రైతులకు తీవ్రంగా నష్టపోయారు. ఈ వర్షం బీభత్సానికి పలు గ్రామాల్లో చెట్లు విరిగిపడ్డాయి. పలు చోట్ల విద్యుత్ తీగలపై చెట్లు పడదంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. అంతేకాకుండా పలు చోట్ల కల్లాల్లో ఆరబెట్టిన మొక్కజొన్న, మిర్చి పంటతో పాటు ఇంకా కంకి విరవక పొలాల్లో ఉన్నటువంటి మొక్కజొన్న పంటకు తీవ్ర నష్టం జరుగుతుందని రైతులు వాపోతున్నారు. వర్షాలకు పంటలను కాపాడుకునేందుకు రైతులు నానా తంటాలు పడుతున్నారు.

– సాక్షి నెట్‌వర్క్



కారేపల్లి: విరిగిపడిన చెట్లు

పంట నష్టం సర్వేలో లోపాలు..



జాబితాలో నమోదు కాని దెబ్బతిన్న మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న బీపీ నాయక్

బోనకల్: అకాల వర్షాలతో దెబ్బతిన్న మొక్కజొన్న పంట నష్టపరిహార సర్వేలో లోపాలు ఉన్నాయని ఆళ్లపాడు రైతులు ఆదివారం రోడ్డెక్కారు. రైతులకు బీజేపీ రాష్ట్ర ఐటీ సెల్ కన్వీనర్ బీపీ నాయక్ మద్దతు తెలిపారు. బాధిత రైతుల పక్షాన పోరాటం చేస్తామని, వారికి అన్ని విదాలుగా అండగా ఉంటామని తెలిపారు. బీడు భూములు, సుబాబుల్ పొలాలకు మొక్కజొన్న పంట దెబ్బతిన్నట్లు అధికారులు నమోదు చేయడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వాస్తవిక సాగుదారులను మరచి సాగుచేయని వారిని జాబితాలో ఎలా నమోదు చేశారన్నారు. మరోసారి విచారణ చేసి తమకు న్యాయం చేయాలని బాధిత రైతులు డిమాండ్ చేశారు. మందా రాజ్యం, బుంగా జ్యోతి అనే మహిళా రైతులు ఒక్కొక్కరు 2ఎకరాలలో మొక్కజొన్న సాగు చేయగా వారి పంట నష్టం నమోదు చేయలేదని వాపోయారు. ఇలా మరికొందరి పంటను తక్కువ ఎకరాల్లో నష్టం జరిగినట్లు నమోదు చేయడంపై పలువరు బాధిత రైతులు మండి పడుతున్నారు. ఈ కార్యక్రమంలో రైతులు షేక్ దస్తగిరి, మరీదు ప్రసాద్, వేల్పుల రమేష్, తిరుపతిరావు, జంపాల రవి, కాలసాని పరుశురాం, తోటకూర వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

పోగొట్టుకున్న బ్యాగు అందజేత

మధిర: రైలులో పోగొట్టుకున్న బ్యాగును రైల్వే పోలీసులు ఆ ప్రయాణికుడికి అప్పగించారు. సికింద్రాబాద్ నుంచి విజయవాడ వెళ్లే ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్‌లో మహమ్మద్ యూసుఫ్ పాషా తన బ్యాగును మర్చిపోయి ఖమ్మంలో దిగిపోయాడు. రైలు కదిలిన తర్వాత ఈ విషయాన్ని గుర్తించి ఆయన వెంటనే ఖమ్మం జీఆర్పీ ఎస్సై భాస్కర రావుకు ఫిర్యాదు చేశాడు. ఎస్సై ఆదేశాల మేరకు మధిర రైల్వే హెడ్ కానిస్టేబుల్ శీలం వేణుగోపాల్ రెడ్డి, ఎం.వెంకటేశ్వర్లు ఆ బ్యాగును తీసుకొని సదరు ప్రయాణికుడికి అప్పగించారు. ఈ బ్యాగులో రూ.80 వేలు విలువచేసే ల్యాప్‌టాప్, రూ.20 వేలు విలువచేసే సెల్ ఫోన్, రూ.700 నగదు, దుస్తులు, గుర్తింపు కార్డులు ఉన్నట్లు బాధితుడు తెలిపాడు. దీంతో బ్యాగును అప్పగించిన రైల్వే పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.



ల్యాప్‌టాప్ అందజేస్తున్న రైల్వే పోలీసులు

యోబును సత్కరించిన సీపీఐ జిల్లా నేతలు

సత్తుపల్లిరూరల్: సీపీఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజా పోరుయాత్రలో భాగస్వామి అయిన సత్తుపల్లి మండల పార్టీ కార్యదర్శి తడికమళ్ల యోబును ఆ పార్టీ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్‌లు మెమొంటో అందించిన సత్కరించారు. ఆదివారం ఖమ్మం సీపీఐ జిల్లా పార్టీ కార్యాలయంలో జరిగిన ప్రజాపోరు యాత్ర బృందంతో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడుతూ.. జిల్లా బృందంలో ఎనిమిది రోజుల పాటు యాత్రలో పాల్గొనటం సంతోషంగా ఉందన్నారు. క్షేత్ర స్థాయిలో ప్రజా సమస్యలను పరిష్కరించడానికి దోహద పడిందన్నారు. అభినందించిన జిల్లా నేతలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

కాంగ్రెస్ మధిర నియోజకవర్గ కోఆర్డినేటర్‌గా ‘వడ్డె’



పీసీసీ సభ్యుడు వడ్డె నారాయణరావు

కొణిజర్ల: మధిర నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ లీడర్‌షిప్ డెవలప్‌మెంట్ మిషన్ కోఆర్డినేటర్ (ఎల్‌డీఎం)గా కొణిజర్ల మండలం పెద్దగోపతికి చెందిన టీపీసీసీ సభ్యుడు వడ్డె నారాయణరావు నియమితులయ్యారు. ఈ మేరకు ఏఐసీసీ ఎస్సీ డిపార్ట్‌మెంట్ చైర్మన్ రాజేష్ లిలోతియా రాష్ట్రంలోని అన్ని ఎస్సీ నియోజకవర్గాలకు కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్‌లను నియమిస్తూ శనివారం రాత్రి ఉత్తర్వులు విడుదల చేశారు. పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి సూచనల మేరకు ఈ నియామకాలు చేపట్టినట్లు ఉత్తర్వులలో పేర్కొన్నారు.



అటెన్షన్ ప్లీజ్

ప్రమాదకరంగా మ్యాన్‌హోల్

సత్తుపల్లి పట్టణంలోని అయ్యగారిపేట రోడ్‌లో రోడ్డుకు ఆనుకొని ఉన్న తాగు నీటి సరఫరా కోసం ఏర్పాటు చేసి మ్యాన్‌హోల్ ప్రమాదకరంగా ఉంది. దీనిపై మూత లేకపోవటంతో అటుగా రాకపోకలు సాగించేవారికి ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు. కావున అధికారులు దానిపై మూత ఏర్పాటు చేసి వాహనదారులను ఆదుకోవాలని పలువురు కోరుతున్నారు.

– సత్తుపల్లిటౌన్



ప్రశ్నించాల్సిన అధికారి : సురేష్, మున్సిపల్ ఏఈ, సత్తుపల్లి, సెల్ నెంబర్: 9030613631